ప్రజాశక్తి
శుక్రవారం 4 అక్టోబర్ 2024
5
పార్వతీపురం మన్యం

ఎస్‌డిపిఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - మక్కువ

స్థానిక పోలీస్ స్టేషన్‌ను పార్వతీపురం ఎస్‌డిపిఒ అంకిత సురానా గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక ఎస్సై ఎం.వెంకట రమణతో కలిసి పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పలు అంశాలపై సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సాలూరు రూరల్ సిఐ పి.రామకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు సూచనలు ఇస్తున్న ఎస్‌డిపిఒ అంకిత సురానా

ఇసుక.. ఉచితం పేరిట మస్కా

- జిల్లా అంతటికీ భామినిలో మాత్రమే రీచ్
- తెచ్చుకోవాలంటే ధర తడిసి మోపెడు
- స్తంభించిన నిర్మాణ పనులు
- లబోదిబోమంటున్న ట్రాక్టర్, భవన నిర్మాణ కార్మికులు
- నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం

ఇసుక ఉచితమంటూ ప్రభుత్వ పెద్దలంతా ఊదరగొడుతున్నారు. సిఎం చంద్రబాబు నాయుడు సహా మంత్రులు ఎమ్మెల్యేలు ఎక్కడికెళ్లినా ఉచితంగా ఇసుక తెచ్చుకోవచ్చునని చెపుతున్నారు. ఎన్నికల ముందు టిడిపి కూటమి పార్టీలు హామీ ఇచ్చిన విధంగా అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్నామని ప్రకటించాయి. అయితే ఆచరణలో మాత్రం ఉచిత ఇసుక విధానం కనిపించడం లేదు. జిల్లా వాసులకు ఇసుక కావాలంటే భామిని మండలంలోని కాట్రగెడ్డ రీచ్ నుంచి మాత్రమే తెచ్చుకోవాలని ప్రభుత్వం ఇటీవల మార్గదర్శకాలు జారీ చేసింది. భామిని కాట్రగెడ్డ రీచ్ నుంచి ఇసుక కావాలంటే ఆన్‌లైన్‌లో ముందుగా బుక్ చేసుకుని తెచ్చుకోవాలి. భామిని మండలం జిల్లాకు ఒక మూలన ఉంది. ఆ రీచ్ పాలకొండ నియోజకవర్గానికి కొంత మేర దగ్గరగా ఉంటుంది. కానీ మిగిలిన మూడు నియోజకవర్గాల్లో గల మండలాలకు ఆమడ దూరంలో ఉంది. సాలూరు నియోజకవర్గానికి ఇసుక తీసుకురావాలంటే భామిని మండలం నుంచి సుమారు 200 కిలోమీటర్ల దూరం వుంటుంది. అక్కడ నుంచి ట్రాక్టర్‌లో ఇసుక రవాణా చేసుకోవడానికి అయ్యే ఖర్చు తడిసి మోపెడవుతుంది. పార్వతీపురం నియోజకవర్గంలో ఉన్న ఏ గ్రామానికి ఇసుక తరలించాలన్నా వంద కిలోమీటర్ల దూరం పైనే వుంటుంది. మరి ఉచిత ఇసుక ఎలా అవుతుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. 2014 నుంచి 2019 వరకు టిడిపి ప్రభుత్వ హయాంలో దాదాపు అన్ని మండలాల్లోనూ రీచ్‌లను ఏర్పాటు చేశారు. నదీ పరివాహక ప్రాంతం ఉన్న అన్ని చోట్లా ఇసుక రీచ్‌లను అప్పటి టిడిపి ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఇప్పుడు మాత్రం జిల్లా అంతటికీ భామిని మండలం నుంచి ఇసుక తరలించుకోవాలని చెపుతోంది. దీని వెనుక కూటమి ప్రభుత్వ రహస్య వ్యూహమేదో దాగి వుందనే ప్రచారం జరుగుతోంది. గత మూడు నెలలుగా జిల్లాలో నిర్మాణరంగ పనులు నిలిచిపోయాయి. ఫలితంగా ట్రాక్టర్లల్లో పనిచేస్తున్న కార్మికులు, భవన నిర్మాణ రంగ కార్మికులకు ఉపాధి లేని పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, ఉచిత ఇసుక విధానం అమలు చేస్తుందని గంపెడాశతో ఎదురు చూసిన బడుగు జీవులకు నిరాశే మిగులుతోంది. ఉచిత ఇసుక విధానం అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడంతో ఇళ్లు నిర్మించుకోవాలనుకునే పేద, మధ్యతరగతి ప్రజలు, భవన నిర్మాణ కార్మికులు, ట్రాక్టర్ యజమానులు, కూలీలు లబోదిబోమంటున్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

టిడిపి ప్రభుత్వం వందరోజుల పాలనలో ఇసుక విధానంపై మస్కా మాటలతో విసిగిపోయిన కార్మికులు, కూలీలు సిఐటియు ఆధ్వర్యాన శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నారు. గత మూడు రోజులుగా రిలే దీక్షలు నిర్వహించినా ప్రభుత్వం స్పందించకపోవడంతో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇసుక విధానంలో తికమక పెట్టే చర్యల వెనుక ఆంతర్యం ఏమిటో తెలుసుకునేందుకు సమాయత్తమవుతున్నారు.

స్థానిక రీచ్‌ల్లో ఇసుక లేదా

జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లోనూ ఇసుక రీచ్ లున్నాయి. నాటుబళ్లతో ఇసుకను ఉచితంగానే తరలిస్తున్నారు. నాటుబళ్ళతో రవాణా చేసుకోవచ్చు కానీ ట్రాక్టర్లతో రవాణా చేయకూడదని, ఒకవేళ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ప్రభుత్వ పెద్దలు ఇసుక ఉచిత మంటూ గొప్పలు చెపుతుంటే అధికారులు మాత్రం ట్రాక్టర్లతో రవాణా చేస్తే చర్యలు వుంటాయని మెలిక పెడుతున్నారు. దీని వెనుక మతలబు ఏమిటో అర్థం కాక జనం తికమక పడుతున్నారు.

రీచ్‌లపై టిడిపి నాయకుల గుత్తాధిపత్యం

మండలాల్లో స్థానికంగా ఉన్న ఇసుక రీచ్‌లపై టిడిపి నాయకుల గుత్తాధిపత్యం కొనసాగుతోంది. ఆ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు మాత్రం నిర్మాణ పనులకు ఇసుక తరలించుకుపోతున్నారు. టిడిపి నాయకుల ట్రాక్టర్లతో ఇసుక తరలించినా అధికారులు, పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాటుబళ్లతో యథేచ్ఛగా రవాణా చేసుకుంటున్నా ట్రాక్టర్లతో తరలింపుపై ఆంక్షలు విధించడంతో నిర్మాణరంగ పనులు ఊపందుకోని పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా జిల్లాలో వేలాది మంది తాపీ మేస్త్రీలు, కార్మికుల, ట్రాక్టర్ యజమానులు, కూలీల ఉపాధి అవకాశాలు దెబ్బతిన్నాయి.

ఉచితంగా ఇసుక ఇవ్వాలి : సిపిఎం

పాలకొండ : రాష్ట్రంలో ప్రభుత్వమే ఉచిత ఇసుక అవసరమైన వాళ్లందరికీ అందిస్తామని హామీ ఇచ్చి, ఆ విధానాన్ని అమలు చేయకపోవడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు విమర్శించారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇసుక అందుబాటులో లేకపోవడంతో భవన నిర్మాణ, ట్రాక్టర్ కార్మికులు, ఇళ్లనిర్మించుకొనే పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఒకే ఒక ఇసుక రీచ్ ఉండడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కావున ఇసుక అందుబాటులో ఉంచాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఈ ధర్నాకు కార్మికులంతా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సాలూరురూరల్ : ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో కోట సెంటర్, శివాజీ బొమ్మ సెంటర్, రాజీవ్ సెంటర్, వడ్డవీధి సెంటర్‌ల్లో ఉన్న కార్మిక వర్గానికి, ఇసుక విధానంపై ప్రభుత్వం అవలంబిస్తున్న విధానం వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్‌వై నాయుడు కార్మికుల ఉద్దేశించి మాట్లాడుతూ ఇసుక సమస్య వల్ల తాపీ కార్మికులు, కార్పెంటర్లు, పెయింటర్లు, ట్రాక్టర్ల కార్మికులు, భవన నిర్మాణదారులు, తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటు న్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, ఇచ్చిన హామీ ప్రకారం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇసుక అందుబాటులో ఉంచాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాలో కార్మికులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నిర్మాణరంగ కార్మిక నాయకులు ఎస్.మోహన్, యుగంధర్, సత్యనారాయణ, సింహాచలం, పార్వతి, లక్ష్మి, రాజేష్, పాల్గొన్నారు.

కొమరాడ: ప్రభుత్వం ఇచ్చిన ఉచిత ఇసుక హామీని తక్షణమే అమలు చేయాలని శుక్రవారం కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వై.మన్మధరావు, జిల్లాకమిటీ సమావేశంలో కె.సాంబమూర్తి పిలుపునిచ్చారు. ఈమేరకు స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ మండలంలో భవన కార్మికులు, ట్రాక్టర్ కార్మికులు, ఇతర పెయింటింగ్ వర్కులు చేసే కార్మికులు సుమారు 5వేల మంది వరకు ఉన్నారని, ఇసుక అందుబాటులో లేకపోవడంతో వీరంతా పనుల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున ప్రభుత్వం తక్షణమే ఉచిత ఇసుకను అందుబాటులో తీసుకొచ్చి కార్మికులను, పేద, మధ్యతరతగతి ప్రజలను ఆదుకోవాలనికోరారు. విలేకరుల సమావేశంలో విలేకరుల సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు సత్యం, సింహాచలం, నాగభూషణ, ఉపేంద్ర, రెడ్డి శివున్నాయుడు, లక్ష్మయ్య, బలరాం, సుబ్బారావు, మధు, కైలాస్, సుందరావు, వెంకట్రావు, సుబ్బారావు, భవన కార్మికుల సంఘం నాయకులు అప్పలనాయుడు పాల్గొన్నారు.

పాచిపెంట: భవన నిర్మాణ కార్మికులకు, ట్రాక్టర్ కార్మికులకు ఉపాధి కల్పించాలని శుక్రవారం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు కోరారు. మండల కేంద్రంలో నిరసనకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అందరికీ ఉచితంగా ఇసుక లభించేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో పాత ఇసుక రీచ్‌లను కొనసాగించాలని కోరుతూ కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న నిరసనలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం కార్యకర్తలు పెంటయ్య, చిన్నారావు, జరజాపు వెంకటరమణ, గమ్మెల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జుగా వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, సబ్ కలెక్టర్, డిఆర్‌ఒ, అధికారులు

'పిఎం జుగా'తో గ్రామాలాభివృద్ధి

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రధానమంత్రి జనజాతీయ ఉన్నతి గ్రామ అభియాన్ (పిఎం జుగా) పథకాన్ని వినియోగించుకొని గ్రామాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ప్రధానమంత్రి జన జాతీయ ఉన్నతి గ్రామ అభియాన్ (పీఎం జుగా) కార్యక్రమం అమలుకు శాఖల వారీగా కావాల్సిన ప్రతిపాదనలపై కలెక్టరేట్ సమావేశమందిరంలో గురువారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిఎం జుగా కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం, ప్రతి కుటుంబానికి ఇళ్లు, మంచినీటి కుళాయి, విద్యుత్ సౌకర్యం కల్పన మొదటి ప్రాధాన్యంగా ప్రతిపాదనలు తయారు చేయాలని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ప్రతి గ్రామంలో రోడ్లు, ఇంటి నిర్మాణం, కరెంటు సదుపాయం, మంచినీటి కుళాయి, మొబైల్ నెట్ వర్కు కల్పన, వైద్య సదుపాయాలు ఏర్పాటు, ప్రతి కుటుంబానికి ఆదాయం పెంపు మొదలైన 25 అంశాలకు సంబంధించిన పనులను చేపట్టవచ్చునని తెలిపారు. వారం రోజుల్లో ప్రతి పథకానికి శాఖల వారీగా ప్రతిపాదనలు తయారుచేసి సమర్పించాలని కలెక్టరు ఆదేశించారు. సమావేశంలో ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, పలుశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధికి జుగా

గిరిజన గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జనజాతీయ ఉన్నతి గ్రామ అభియాన్ (పిఎం జుగా) పథకాన్ని అమలు చేస్తున్నదనికలెక్టరు శ్యామ్ ప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ పథకం వివరాలను తెలిపారు. తొలుత ఈ పథకం పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం కలెక్టరు మాట్లాడుతూ ఈ పథకం ద్వారా జిల్లాలోని 500 మందికి పైగా జనాభా కలిగిన గ్రామాలు 165, 50 మంది పైగా జనాభా కలిగిన గ్రామాలు 703 లబ్ది పొందుతాయని తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని, ప్రతి గ్రామానికి రోడ్డు నిర్మాణం, ప్రతి కుటుంబానికి ఇంటి నిర్మాణం, కరెంటు సదుపాయం, మంచినీటి కుళాయి ఏర్పాటు, మొబైల్ నెట్ వర్కు కల్పన, వైద్య సదుపాయాలు ఏర్పాటు, గ్యాస్ సదుపాయం, వంటి 25 అంశాలకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో బాలికలు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని, వారిని ప్రోత్సహించేందుకు, బాలికల్లో డ్రాపౌట్స్ తగ్గించేందుకు 12వ తరగతి, డిగ్రీ చదివే విద్యార్థినులకు ప్రతి మండలానికి ఒక వసతి గృహం ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు. ప్రతిమండలానికి ఒక విడివికె కేంద్రం, వైద్య సదుపాయం అందుబాటులో లేని చోట మొబైల్ మెడికల్ యూనిట్లు ఏర్పాటు చేస్తునట్లు తెలిపారు. గిరిజనులకు సంబంధించి పూర్తివివరాలను ప్రత్యేక యాప్‌లో సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా మంచి ఫలితాలు సాధించిన గ్రామాలకు ప్రభుత్వం రూ.22 లక్షలు ప్రత్యేక గ్రాంటు ఇస్తున్నదని, జిల్లాలో ప్రతి గ్రామం ఈ గ్రాంటుకు పోటీ పడేలా అమలు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించినట్టు తెలిపారు.

అర్తలి రహదారి సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని అర్తలి రహదారి సమస్య పరిష్కారించాలని ఎంపిపి బొమ్మాల భాను గురువారం సబ్ కలెక్టర్ సియశ్వంత్ రెడ్డిని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన సబ్‌కలెక్టర్‌ను కలిశారు. అనంతరం ఎంపిపి మాట్లాడుతూ ప్రధాన రహదారి సమస్య తీవ్రంగా ఉందని ఆయనకు వివరించారు. ఎదురెదురుగా వాహనాలు వస్తే అవి వెసులుబాటుకు అయ్యేందుకు అవకాశం కూడా ఉండడంలేదన్నారు. దీనివల్ల వాహనచోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఇప్పటికైనా స్పందించి రోడ్డు వెడల్పు పెంచాలని కోరారు. దీనికి సబ్ కలెక్టర్ స్పందిస్తూ ఈ విషయాన్ని పరిశీలించి సానుకూలంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు

ఉక్కు ప్రయివేటీకరణను అడ్డుకుంటాం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

విశాఖ ఉక్కును నిర్వీర్యం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రైవేటీకరణ విధానాన్ని అడ్డుకుంటామని ఆంధ్రప్రదేశ్ రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా సంఘాల రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా గురువారం ఎపి రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్షలు చేపట్టారు. రైతు సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ బంటు దాసు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి.నర్సింగరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రెడ్డి ఈశ్వరరావు కొల్లి గంగు నాయుడు, అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.సంగం, ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, ఎం.గౌరి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జి.సూరయ్య, రైతు సంఘం నాయకులు ఇవి నాయుడు, బి.గౌరినాయుడు, గేదెల సత్యనారాయణ, రజక సంఘం నాయకులు దాటిశెట్టి, సిఐటియు నాయకులు బి.సూరిబాబు, జి వెంకటరమణ, ఎఐటియుసి నాయకులు కె.జీవ, గిరిజన సంఘ నాయకులు పి.రాము తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, ప్లాంటుకు సొంత గనులు, వర్కింగ్ కేపిటల్ ఇవ్వాలని, ప్లాంట్‌ను పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడిపించాలని, ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలని, నిర్వాసితులకు ఉద్యోగాలివ్వాలని, కార్మికులందరికీ సకాలంలో జీతాలివ్వాలని డిమాండ్ చేశారు. ప్లాంటును రోజు రోజుకు బిజెపి ప్రభుత్వం దెబ్బతీస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎందుకు నిలదీయడంలేదని ప్రశ్నించారు. సెయిల్లో విలీనం చేసేందుకు టిడిపి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు.

అనంతరం ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమపై బిజెపి కుయుక్తులకు టిడిపి, జనసేన, వైసిపి కపట నాటకాలు ఆడుతున్నాయని విమర్శించారు. స్టీలు ఉత్పత్తికి ఇనుప ఖనిజంతో పాటు బొగ్గు కావాలని, స్టీలు ప్లాంటుకు బొగ్గు సరఫరా కాకుండా కుట్రలు చేసింది బిజెపి, దాని మిత్ర పార్టీలేనని అన్నారు. మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌ల్లో రెండు మూత పడిపోయాయని, స్టీలు ప్లాంటులో పని చేస్తున్న 4వేల మంది కార్మికులను పని నుంచి నిలిపేసిందని, ప్లాంటును తమ కార్పొరేట్ మిత్రులకు అమ్మేస్తాం, లేకుంటే పూర్తిగా చంపేస్తామని మోదీ ప్రభుత్వం శపథం చేసిందని, ఇప్పుడు అదే పని చేస్తుందని అన్నారు. అంబానీ, ఆదాని ప్లాంట్లకు గనులు కేటాయించిన మోడీ, ప్రభుత్వ పరిశ్రమకు ఎందుకు కేటాయించడం లేదని ప్రశ్నించారు. ఏనాటికైనా స్టీల్ ప్లాంట్‌ను కార్పొరేట్ల చేతుల్లో తాకట్టు పెట్టాలనే ప్రయత్నం మోడీ చేపడుతుందని దీన్ని తీవ్రంగా ఖండించాలని నేటి యువతరానికి పిలుపునిచ్చారు. బిజెపితో కలిసి రాష్ట్రానికి పరిశ్రమలు తెచ్చి లక్ష ఉద్యోగాలు సృష్టిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ స్టీల్ ప్లాంట్ సమస్య నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి తిరుపతి లడ్డు కల్తీ నాటకానికి తెరాతీశారని, కల్తీ జరిగితే కల్తీ చేసిన వారిని శిక్షించే అధికారం ఉన్నా ఆ పని చేయడం లేదని, చేయాల్సిన పని చేయకపోగా మతోన్మాదాన్ని ఎందుకు రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. ఇకనైనా స్టీల్ ప్లేట్ ప్రైవేట్ కారణ నిర్ణయాన్ని బిజెపి ఉపసంహ రించుకోవాలని, రాష్ట్ర అధికార ప్రతిపక్ష పార్టీలు కూడా ప్రజల , ప్రజల పక్షాన నిలవాలని డిమాండ్ చేశారు.

కలెక్టరేట్ ఎదుట రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యాన దీక్షలు

దీక్షలను ఉద్దేశించి మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి

ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే తెలపండి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఓటర్ల జాబితాకు సంబంధించిన అభ్యంతరాలుంటే తెలియజేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్ఒ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ 2025 సంబంధించి ఇంటింటికి ఓటరు జాబితా తనిఖీ చేస్తామన్నారు. జిల్లాలో 78,3972 మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో 78,2260 ఓటర్లను ధృవీకరించినట్లు తెలిపారు. ఫారం-6,7,8 సంబంధించి 5140 దరఖాస్తులు స్వీకరించగా వాటిలో 291 తిరస్కరించగా, 1064 పరిష్కరించగా, 3758 ఫారాలు పెండింగులో ఉన్నాయని వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. రాజకీయపార్టీల నుంచి కొత్తగా రెండు పోలింగు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిందిగా ప్రతిపాదించారని బలిజపేట మండలం రాయి వలస, కురుపాం మండలం బత్తిలిలో పోలింగు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు తెలిపారు. 5 పోలింగు స్టేషన్ల లొకేషన్లు, 21 పోలింగు కేంద్రాల పేర్లు మార్పుకొరకు ఎన్నికల కమిషనుకు ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు తెలిపారు. 2025 జనవరి 1న 18 ఏళ్లు నిండిన ఓటర్లు / అర్హత కలిగిన పౌరులు, అంతకుముందు సందర్భాల్లో నమోదు చేసుకోలేక పోయిన వారు తమ దరఖాస్తులను ఈనెల 29నుంచి నవంబర్ 28 వరకు నమోదు, అభ్యంత రాలు, దిద్దుబాట్ల కోసం దాఖలు చేసుకోవచ్చునని తెలిపారు. పోలింగ్ స్టేషన్లలో అక్టోబరు 9, 10, 23, నవంబరు 23, 24 ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక ప్రచార రోజుల్లో ముసాయిదా ఓటర్ల జాబితా తో పాటు సంబంధిత పోలింగ్ స్టేషన్ల ఓటరు జాబితాలను పరిశీలించి, సవరణలు మొదలైన వాటిని గుర్తించి, దరఖాస్తులను స్వీకరించడానికి, దరఖాస్తుదారులకు మార్గనిర్దేశం చేయడానికి, పోలింగ్ స్టేషన్లో వారి సందేహాలను నివృత్తి చేయడానికి పోలింగ్ స్టేషన్ బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. సమావేశంలో జనసేన ప్రతినిధి పైలా శ్రీనివాస రావు, టిడిపి ప్రతినిధి ఎ.శివకుమార్, బిజెపి ప్రతినిధి పారిశర్ల అప్పారావు, బిఎస్‌పి ప్రతినిధి తామరకండి వెంకటరమణ, సిపిఎం ప్రతినిధి పి.రాజశేఖర్, వైసిపి ప్రతినిధి ఎస్. శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమాలపై దర్యాప్తునకు ఎమ్మెల్యే ఆదేశం

పార్వతీపురం టౌన్ : స్థానిక మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి అక్రమాలపై దర్యాప్తునకు ఆదేశించినట్లు ఎమ్మెల్యే విజయచంద్ర తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ అధికారి అక్రమాలపై తీవ్ర ఆరోపణ వచ్చాయని, చాలామంది వద్ద డబ్బులు తీసుకున్నట్లు నిబంధనలు విరుద్ధంగా అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయన్నారు. అధికారి వల్ల ఎవరెవరూ ఇబ్బందిపడ్డారో, వారంతా ముందుకొచ్చి తెలియజేస్తే వారికి న్యాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారి వల్ల ఏ విధమైన నష్టం జరిగినా, అన్యాయానికి గురైనా, స్వచ్ఛందంగా ముందుకొచ్చి తన దృష్టికి తీసుకురావాలని బాధితులకు తగు న్యాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

వైభవంగా దసరా ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలోని కోటదుర్గ అమ్మవారి ఆలయంలో గురువారం నుండి దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 8గంటలకు ముహూర్తం వేశారు. స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నేని అప్పలనాయుడు, యోగిత దంపతులు, టిడిపి పట్టణ అధ్యక్షులు గంటా సంతోష్ కుమార్, తదితరులు తొలిపూజ చేశారు. ముందుగా ఎమ్మెల్యే అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. 8గంటల నుంచే యాత్రికుల తాకిడి పెరిగింది. వేల సంఖ్యలో మొదటిరోజే యాత్రికులు వచ్చారు. క్యూ లైన్లో మజ్జిగ, తాగునీటి సౌకర్యం కల్పించారు. ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షులు పల్లా కొండలరావు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని దేవాదాయ శాఖ వారికి సూచించారు. మధ్యాహ్నం 3గంటల వరకు అమ్మవారి నిజరూప దర్శనం యాత్రికులకు లభించింది. సబ్ కలెక్టర్ యశ్వంత్‌రెడ్డి ఏర్పాట్లును దగ్గరుండి పర్యవేక్షించారు. వచ్చిన వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఎంతమంది నిజరూప దర్శనానికి హాజరవుతారని ఆలయ కార్యనిర్వాహక అధికారిగా సూర్యనారాయణను అడగ్గా, సుమారు 20వేల మంది హాజరవుతారని చెప్పారు. డీఎస్పీ ఎం రాంబాబు, సిఐ చంద్రమౌళి ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు. ఆలయ ప్రధాన ద్వారం ఎమ్మెల్యే స్థాయి వ్యక్తులను మాత్రమే పంపించాలని, మిగతా విఐపిలను వేరే మార్గం నుంచి పంపించాలని అధికారులను ఆదేశించారు. 30రుపాయలు, వందరుపాయిల టికెట్లు కూడా ఏర్పాట్లు చేసినప్పటికీ రాజకీయ నేతల సిఫార్సుతో టికెట్లు తీయకుండా విఐపి దర్శనానికే ఎక్కువ మంది పరుగులు తీశారు.

అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పలు ప్రముఖులు సందర్శన

కోటదుర్గ అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం రోజు పలు ప్రముఖులు దర్శించుకున్నారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, కేంద్ర ఫైనాన్స్ కార్యదర్శి ప్రియాంక నిషా, మాజీ ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతి, టిడిపి నియోజకవర్గ ఇన్-ఛార్జ్ పడాల భూదేవి, మాజీ జెడ్పీటిసి సభ్యులు సామంతుల దామోదర్ రావు, విజిలెన్స్ సిఐ అప్పలనాయుడు, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు దారలపూడి లక్ష్మీ ప్రసాద్ శర్మ ప్రత్యేక పూజలు జరిపారు.

రావికోనలో ఏనుగుల తిష్ట

భయాందోళనలో గిరిజనులు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లాలోని పలు మండలాల్లో గత కొన్ని ఏళ్లుగా ఏనుగులు సంచరిస్తూ ఆస్తి, ప్రాణ నష్టం కలిగిస్తున్నాయి. అయితే బుధవారం అర్ధరాత్రి నుండి ఆంధ్ర ఒడిశా సరిహద్దుల్లో గల పార్వతీపురం మండలం రావికోన పంచాయితీ పరిసర గ్రామాల్లోకి చేరుకొని పామాయిల్ తోటల్లో తిష్ట వేయడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. కొమరాడ మండలం విక్రాంపురం పంచాయతీ నందాపురం మీదుగా పార్వతీపురం మండలం చినమరికి, చందలింగి నుంచి రంగాలగూడ తోటల్లో గురువారం ఉదయం చేరుకున్నట్లు ఫారెస్ట్‌రేంజ్ అధికారి మణికంఠ తెలిపారు. రెండేళ్ల క్రితం ఇదే ప్రాంతానికి చేరుకున్న ఏనుగులు కొద్ది రోజులు ఉండి వెనుతిరిగి వెళ్లడం అలవాటుగా మార్చుకున్నాయని, ప్రస్తుతం వీటి కదలిక గమనిస్తే మళ్లీ తిరిగి వెనక్కు వెళ్లే సూచనలు కనిపిస్తున్నాయి. ఏదైనాప్పటికీ సంగంవలస, రావికోన, ఎమ్మార్ నగరం గ్రామాలకు చెందిన ప్రజలతో పాటు కొత్తవలస, బట్టివలస గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని, రావికోనలోని గిరిజన సంక్షేమ వసతి గృహంలోని విద్యార్థులు బయటనే సంచరించకుండా చర్యలు సంబంధిత అధికారులు తీసుకోవాలని, ఏనుగుల సంచారంపై సచివాలయ సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేయాలని అటవీ అధికారులు తెలియచేస్తున్నారు.


రావికోన ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగు

ముంపు బాధితులకు విరాళాల అందజేత

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

విజయవాడలో ఇటీవల జరిగిన ముంపు వల్ల నష్టపోయిన బాధితులకు ముఖ్యమంత్రితో పాటుగా స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర పిలుపు మేరకు అభిమానులు విరాళాలు సేకరించి అందిస్తున్నారు. మండలంలోని జమదాలకు చెందిన యువతలో సేకరించిన రూ.30 వేలు, తాళ్ళ బురిడి యువజన సంఘం సభ్యులు ప్రజల నుంచి సేకరించిన రూ.20 వేల చెక్కుల రూపంలో సిఎం సహాయ నిధికి జమ చేయమని ఎమ్మెల్యేకు గురువారం అందజేశారు. ఎమ్మెల్యే ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పౌరులు స్పందించడం గొప్ప విషయమని, వీరిని ఆదర్శంగా తీసుకొని మిగతా గ్రామాల నుంచి విరాళాలు అందజేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గొట్టాపు వెంకట నాయుడు, మండల అధ్యక్ష, కార్యదర్శులు గౌరజాన చంద్రమౌళి, బోను చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

దశమంతపురంలో ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని దశమంతపురం గ్రామంలో గురువారం స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, రక్తపోటు, మధుమేహ, తదితర రకాలైన వ్యాధులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి లలిత, ఎఎన్ఎం అశ్విని, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, పాల్గొన్నారు.

ఎల్ఐసి కార్యాలయం ఎదుట ఏజెంట్ల ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

జీవిత బీమా పాలసీదారుడు నుంచి జిఎస్‌టి వసూలు చేయడాన్ని నిరసిస్తూ గురువారం పార్వతీపురం ఎల్ఐసి కార్యాలయం ఎదుట ఏజెంట్ల సంఘం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. పాలసీదారులకు బోనస్ పెంచాలని పాలసీలకు జిఎస్‌టిని తొలగించాలని పాత జీవిత బీమా పద్ధతులనే కొనసాగించాలని రుణాలపై వడ్డీ రేట్లు తగ్గించాలని ఏజెంట్ల కమిషన్ పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి ఏజెంట్లు పాల్గొన్నారు.

కోటలో ఘనంగా దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి - కురుపాం

దసరా నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని కురుపాం కోట వద్ద కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిషోర్ చంద్రదేవ్ దంపతులు గురువారం కోటలో ఖడ్గ దుర్గతల్లిని వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు నడుమ అనువంశిక పూజాలు ఘనంగా నిర్వహించారు. దసరాకు తొమ్మిది రోజులు ముందు నుంచి నవరాత్రులు జరుగుతాయని, ఈ నవరాత్రులు జరిగే సమయంలో కోటలో భక్తులు సౌకర్యార్థం తలుపులు తెరిచి ఉంటాయని, కావున కురుపాం చుట్టుపక్క ప్రాంతాల ప్రజలు దుర్గ తల్లిని దర్శించుకోవడానికి తండాలుగా వస్తూ దుర్గా తల్లిని దర్శించుకుంటారు.

కురుపాం ఎస్ఐగా నారాయణరావు

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం ఎస్సైగా పి. నారాయణరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలందరితో ఫ్రెండ్లీ పోలీస్‌గా ఉండి తమ విధులు బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తానని గతంలో ఇదే నియోజకవర్గంలో గుమ్మలక్ష్మీపురం, నీలకంఠాపురం, చినమేరంగి పోలీస్ స్టేషన్లో పనిచేశానని అనుభవంతో ఉండడంతో ఈ ప్రాంత ప్రజలందరితో తత్సంబంధాలు ఉన్నాయని అన్నారు.

జర్జాపు సోదరులకు అభినందనలు

ప్రజాశక్తి - సాలూరు

ఇటీవల వైసిపి నుంచి జనసేనలో చేరిన మాజీ మున్సిపల్ చైర్మన్ జర్జాపు ఈశ్వరరావు, సీనియర్ నాయకులు జర్జాపు సూరిబాబును పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. టిడిపి కూటమి పార్టీల్లో ఒకటైన జనసేనలో జర్జాపు సోదరులు చేరడంతో నియోజకవర్గంలో మరింత బలం చేకూరుతుందని చెప్పారు. బిజెపి నాయకులు గొర్రె శివప్రసాదరావు, రావెళ్ల లక్ష్మణరావు, ఎన్.శ్రీనివాసరావు, గాడి ప్రదీప్ జర్జాపు సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.

పార్వతీపురం ఎక్సైజ్ సిఐగా సురేష్

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

పార్వతీపురం ఎక్సైజ్ సిఐగా కె సురేష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఆయన బాధ్యతలు చేపట్టిన తరువాత, పార్వతీపురం ఎమ్మెల్యే బోనేలా విజయచంద్రని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్య విధానాన్ని అవగాహన చేసుకుని సక్రమంగా అమలు చేయాలని, నాటు సారా పట్టణంలో ప్రవేశించకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని కోరారు.

7నుంచి బస్‌పాసుల జారీ

ప్రజాశక్తి- సాలూరు

ఈనెల 5,6 తేదీల్లో ఎపిఎస్ ఆర్‌టిసి బస్ పాస్ వెబ్ సైట్ ఆధునీకరణ కారణంగా ఈనెల 7 నుంచి సాధారణ ప్రయాణికులు, విద్యార్థులకు పాస్‌లు జారీ చేయనున్నట్లు డిపో మేనేజర్ భాస్కర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, ప్రయాణికులు 7నుంచి యధావిధిగా బస్ పాస్‌లు పొందవచ్చునని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

కోటదుర్గమ్మకు వీణ బహూకరణ

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంమైన కురుపాంలో గల రావాడ జంక్షన్ వద్ద వెలిసిన కోట దుర్గమ్మవారికి గురువారం లక్ష్మీ గణపతి స్వీట్స్ యజమానులు ఈదుబిల్లి బలరాం, శ్రీనివాస్ ఇత్తడి వీణను నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మేళతాళాలతో తోడ్కొని వచ్చి అలంకరించారు. అలాగే గుమ్మలో వెలసిన నీలకంఠేశ్వర స్వామి ఆలయానికి హైదరాబాదులో నివాసం ఉంటున్న బి.శ్రీనివాస్ మైక్‌సెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నేడు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని శుక్రవారం మక్కువ, మావుడి సబ్ స్టేషన్ పరిధిలో గల అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆ శాఖ ఈఈ కె.గోపాల్ రావు నాయుడు తెలిపారు. 33 కేవీ పరిధిలో చెట్ల తొలగింపు, లైన్ మెంటెనెన్స్ జరనున్న నేపథ్యంలో ఈ అంతరాయం ఏర్పడనుందని ప్రజలు సహకరించాలని కోరారు.

మొక్కజొన్న పంట పరిశీలన

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని నంద గ్రామంలో దెబ్బతిన్న మొక్క జొన్న పంటను సాలూరు వ్యవసాయ శాఖ ఎడిఎ ఎం.మధుసూదన రావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న పంట పొలంలో వేరువేరుగా ఉండడాన్ని పరిశీలించారు. పంట నష్టానికి గల కారణాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ శ్రీనివాసరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ పి.వేణు రైతులు పాల్గొన్నారు.

రసీదులు ఇవ్వకుంటే చర్యలు తప్పవు

రైతులు పురుగు మందులు, విత్తనాలు, ఎరువులు వ్యవసాయానికి సంబంధించి ఏ వస్తువులు కొన్నా దుకాణదారులు విధిగా రసీదులు అందజేయాలని ఎడిఎ మధుసూదనరావు తెలిపారు. వ్యవసాయానికి సంబంధించి కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు మండలంలో తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని గిరిజన రైతులకు ఆయన సూచించారు. ఏ దుకాణదారుడైన రసీదు ఇవ్వటానికి నిరాకరిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని అలాంటివారిపై తగు చర్యలు తీసుకుంటామని గిరిజనరైతులకు ఆయన వివరించారు.

తెగుళ్లను పరిశీలిస్తున్న ఎడిఎ మధుసూదనరావు

ఏడేళ్లుగా ఎదురుచూపు

- కూటమి ప్రభుత్వంలోనైనా టిడ్కో ఇళ్లు పంపిణీ జరిగేనా
- మళ్లీ టిడిపి అధికారంలోకి రావడంతో ఆశగా చూస్తున్న లబ్ధిదారులు
- ఇప్పటికే డిడిల రూపంలో నగదు చెల్లింపు

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

పట్టణంలోని ఇళ్లులేని నిరుపేదల కోసం నిర్మించిన టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు ఏడేళ్లు అయినా నేటికీ పంపిణీ చేయలేదు. దీంతో లబ్ధిదారులు టిడ్కో ఇళ్ల కోసం కళ్ల కాయలు కాచేలా ఎదురుచూస్తున్నా ఫలితంలేదు. 2014లో అప్పటి టిడిపి ప్రభుత్వం పట్టణాల్లో ఇళ్ల లేని పేదలకు షేర్ వాల్ టెక్నాలజీతో టిడ్కో ఇళ్లను సబ్సిడీపై బ్యాంకు రుణం ద్వారా కట్టించి ఇస్తామని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. ఇందులో భాగంగా పార్వతీపురం మున్సిపాలిటీ పరిధిలో 1488 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి, కేటగిరి-1లో 300 చదరపు అడుగులకు రూ.500, కేటగిరి-2లో 365 చదరపు అడుగులకు రూ.50 వేలును రూ.12,500 చొప్పున నాలుగు దఫాలుగా చెల్లించేందుకు, కేటగిరి-3లో 430 చదరపు అడుగులకు లక్ష రూపాయలను 25 వేలు చొప్పున నాలుగు దఫాలుగా కమిషనర్ పేరున బ్యాంకులో రెండు కోట్ల రూపాయలు డిడిల రూపంలో చెల్లించారు. అయితే రెండేళ్లయినా ఇళ్ల నిర్మాణ పనులు పూర్తిస్థాయిలో జరగకపోవడంతో 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ నిర్మాణాలు చేస్తున్న కాంట్రాక్టును రద్దుచేసి కొత్త కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించింది. అయితే టిడిపి ప్రభుత్వ హయాంలో ఎంపికైన 1488 మంది లబ్ధిదారులను వైసిపి ప్రభుత్వం కుదించి ఇళ్లు లేని 768 మంది లబ్ధిదారులకు 300 చదరపు అడుగుల ఇళ్లను రూపాయికి ఇచ్చేందుకు పార్వతీపురం మండలం అడ్డాపుశిల వద్ద ఉన్న ప్రభుత్వ స్థలంలో 16 బ్లాకుల్లో టిట్కో గృహ సముదాయాలను నిర్మించారు. లబ్ధిదారుల పేరున రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తయింది. ఈ పనులు కూడా కొంత స్థాయిలో పూర్తయ్యాయి.

అసంపూర్తిగా ఉన్న రహదారి

కానరాని మౌలిక సదుపాయాలు

గృహ సముదాయ పనులు పూర్తి కావచ్చినా మౌలిక సదుపాయాల్లేవీ లేవు. మంచినీరు, రహదారులు, కాలువలు, విద్యుత్ సరఫరాకు సంబంధించిన పనులు పూర్తి కాలేదు. ఎన్నికలకు ముందు ఆ పనులను త్వరగా పూర్తి చేసి పంపిణీ చేసేందుకు ప్రయత్నించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. దీంతో పాటు కాంట్రాక్టర్‌కు బిల్లుల బకాయి ఉండడంతో పనులు జరగలేదు. ఇదే మున్సిపాల్టీకి చెందిన వైసిపి సీనియర్ నాయకులు జమ్మాన ప్రసన్న కుమార్‌కు టిట్కో చైర్మన్‌గా ఉన్నప్పటికీ ఈ ఇళ్లను లబ్ధిదారులకు ఇచ్చేందుకు పూర్తి స్థాయిలో చొరవ చూపలేదనే విమర్శలు కూడా లబ్ధిదారుల నుంచి వెళ్లువెత్తుతున్నాయి. అంతేకాక ఐదేళ్లు పూర్తయినా వైసిపి ప్రభుత్వం టిట్కో ఇళ్లను అసంపూర్తిగా పూర్తిచేసి రంగులు వేశారే తప్ప లబ్ధిదారులకు అందించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ఇళ్లను లబ్ధిదారులకు అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజులు పూర్తయినా టిట్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇచ్చేందుకు అడుగులు ముందుకు వేసేందుకు కృషి చేయడం లేదని చెప్పవచ్చు. దీంతో ఈ ఇళ్లు తమ చెంతకు ఎప్పుడు చేరుతాయనని లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. స్థానిక బోనెల విజయచంద్ర స్పందించి టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి తమకు అందజేసేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు. అలాగే ఇళ్ల కోసం బ్యాంకులో డిడి రూపంలో లక్షలాది రూపాయల చెల్లించిన మిగతా బాధిత లబ్ధిదారులకు నగదును ప్రభుత్వం నుండి తిరిగి ఇచ్చేందుకు కృషి చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే ఏ విధంగా కృషి చేస్తారో అని బాధితులు ఎదురుచూస్తున్నారు.

ప్రారంభానికి సిద్ధంగా ఉన్న టిడ్కో ఇల్లు

అర్హత ఉన్నా కేటాయించిన ఇంటిని రద్దు చేశారు

గత టిడిపి ప్రభుత్వ హయాంలో కేటాయించిన ఇంటిని రద్దు చేయడం అన్యాయం. ఏడేళ్ల క్రితం టిడిపి ప్రభుత్వ హయాంలో మంజూరైన టిట్కో ఇంటి కోసం లక్ష రూపాయలు లబ్ధిదారులు వాటా నిమిత్తము నాలుగు దఫాలుగా అప్పు చేసి మరి బ్యాంకులో డిడి తీశాం. తీరా ఇల్లు లేదు సరికదా డబ్బులు తిరిగి ఇవ్వలేదు. ఈ విషయమై మున్సిపల్ అధికారుల నుండి నేటివరకు సరైన సమాధానం లేదు.

కె.విజయలక్ష్మి, గృహిణి, బాధితురాలు.

ఇల్లూ లేదు... డబ్బులివ్వలేదు

ఏడేళ్ల క్రితం టిడ్కో ఇంటి కోసం డబ్బులు చెల్లిస్తే ఇంతవరకు ఇల్లు ఇవ్వలేదు సరికదా, డబ్బులు కూడా మున్సిపల్ అధికారులు చెల్లించలేదు. నేను ఓ ప్రైవేటు పాఠశాలలో చిరు ఉద్యోగిగా పని చేస్తున్నాను. సొంత ఇంటి కోసం ఆశపడి అప్పులు చేసి బ్యాంకులో డిడి చెల్లించాను. అయినా అధికారులు ఇవ్వలేదు సరికదా, డబ్బులు కూడా చెల్లించలేదు. దీంతో చేసిన అప్పులకు వడ్డీలు కట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇల్లు అయినా ఇవ్వడి. లేకుంటే నేను చెల్లించిన డబ్బులైనా తిరిగి ఇచ్చేయండి

సోమేష్, చిరుద్యోగి, బాధితుడు

గిరిజన గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని గిరిజన గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం మండలంలోని పనసాగుడ, కె.గుమడ గ్రామాల్లో వ్యవసాయ అధికారి పి.శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు అవగాహన కల్పించారు. చీడపీడలు రాకుండా ఎలా రక్షించాలన్న అంశంపై అవగాహన నిర్వహించారు. వరి ఏపుగా పెరగడానికి కొన్ని చిట్కాలు తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖల అధికారులు, విఎఎలు పాల్గొని ఆయా శాఖలు పథకాల గురించి వివరించారు.

సీతానగరం : మండలంలోని లచ్చయ్యపేటలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.అవినాష్ మాట్లాడుతూ వారిపై వస్తున్న తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులు కారణంగా వరిపై తెగుళ్ల ప్రభావం పడుతుందన్నారు. ప్రతి రైతు ఇ- పంటను నమోదు చేసుకోవాలన్నారు. ఆయా రైతు భరోసా కేంద్రాల వద్ద ఆ గ్రామ రైతులు నమోదు చేసుకోవాలన్నారు. ఖరీఫ్ చేసిన సంబంధించి పంటలకు ఇ- పంట నమోదు ఎంతో మేలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వి.గుంపుస్వామి, రైతులు, విఎఎ పాల్గొన్నారు.

సీతానగరం: తెగుళ్లను పరిశీలిస్తున్న ఎఒ అవినాష్

వీరఘట్టం : సేంద్రీయ ఎరువులతో పంటలు సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి జె.సౌజన్య రైతులకు సూచించారు. మండలంలోని నర్సిపురం, చలివేంద్రి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సమయంలో పంటకు సుడి దోమ ఆశించే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున తూటికాడ, ఆవు మూత్రాలను మరిగించి పంటపై పిచికారీ చేయాలన్నారు. నర్సిపురంలో పత్తి పంటను పరిశీలించి వాటిపై సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఎఇఒ బి.కృష్ణకాంత్, విఎఎలు, రైతులు, పాల్గొన్నారు.

పాచిపెంట: మండలంలోని శతాభి, చిట్యాడ గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి తిరుపతిరావు మాట్లాడుతూ పోడు వ్యవసాయంలో దిగుబడులు పెరిగి ఎక్కువ సంవత్సరాలు పోడు బాగుండాలంటే ఘన, ద్రవ జీవామృతాలను వేసుకోవాలన్నారు. వీలైనంత వరకు పశువుల పెంటను కూడా సేకరించి వేసుకోవాలని చెప్పారు. గిరిజనులు చిరుధాన్యాల సాగును మరింత పెంచాలని గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం చిరుధాన్యాల సాగు పెరిగిందని ఇంకా విస్తీర్ణం పెంచాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. గ్రామం మొత్తానికి కనీసం ఒక ట్రాక్టర్ మంజూరు చేయాలని, దీంతో పాటుగా ఇక్కడ కాఫీ తోటల ఆదాయం బాగుంటుందని దీనికోసం సిల్వర్ వర్క్ మొక్కలను సరఫరా చేయాలని సర్పంచ్ రామయ్య కోరారు. అనంతరం రైతులు ప్రకృతి సేద్య స్టాళ్లు ను ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు కిరణ్ ప్రకృతి సేద్య ప్రతినిధులు సురేష్, విజయ్, గ్రామ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పాచిపెంట: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ తిరుపతిరావు

రహదారుల నిర్మాణాలు చేపట్టాలి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని గిరిజన గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న, మరమ్మలకు గురైన రహదారులు వెంటనే నిర్మించాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు బిడ్డిక అప్పారావు, పి.సాంబయ్య అధికారులను డిమాండ్ చేశారు. మండలంలోని పూతికవలస, పెదకంబ, దారబా, శంభాంలో వేసిన రోడ్లు నాణ్యత లేకపోవడంతో వేసిన కొద్ది కాలంలోనే పాడై పోతున్న పట్టించు కోవడం లేదన్నారు. పాలమానుగూడ రోడ్, వంబరెల్లి రోడ్, ముత్యాలు రోడ్, దారబంధం రోడ్డు పనులు పూర్తి కాకుండానే కాంట్రాక్టర్లు, అధికారుల సాయంతో బిల్లులు చేసుకున్నారని విమర్శలు చేశారు. కుద్దపల్లి, పులిగుమ్మి, డబర, రుక్మిణిగూడ, అంటికొండ, మర్రిపాడు వంటి అనేక గ్రామాలు రోడ్లు పూర్తిగా పాడైపోయి అనేక ఏళ్లుగా మరమ్మతుల్లేక గిరిజనులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇంత జరుగుతున్నా కూటమి ప్రజా ప్రతినిధులు మాది మంచి ప్రభుత్వమని ప్రచారం చేసుకోవడం దారుణమన్నారు. 15 రోజుల్లో పనులు ప్రారంభించకపోతే సీతంపేట ఐటిడిఎను ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఉద్యోగం చేయకుండా జీతం ఎలా ఇస్తున్నారు?

సిహెచ్‌సి సిబ్బందిపై ఎమ్మెల్యే ఆగ్రహం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

రెండేళ్లుగా ఉద్యోగం చేయని వారికి జీతాలు ఎలా ఇస్తున్నారని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రశ్నించారు. మండలంలోని చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో గురువారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కమిటీ అధ్యక్షులుగా ఎమ్మెల్యే అధ్యక్షతన కమిటీ సభ్యులు మంతిని మురళి, రంగుముద్రి సింహాచలం, గొట్టిపల్లి రాణి, ఎంపిపి బొంగు సురేష్‌తో ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు. ఆస్పత్రి అభివృద్ధికి సంబంధించి గతంలో నిర్వహించిన రికార్డులను ఆమె పరిశీలించారు. ఆసుపత్రి నిర్వహణకు అయిన ఖర్చులు, సిబ్బంది వివరాలు, రోగులకు అందిస్తున్న ఆహారం, సిబ్బంది పనితీరు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలో రెండేళ్లుగా సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్న ధనంజయ సక్రమంగా విధులు నిర్వహించకుండా నిర్లక్ష్యంతో ఉండగా అలాంటి వారికి జీతాలు ఎలా చెల్లిస్తున్నారని స్కాట్లాండ్ సెక్యూరిటీ సంస్థపై ఆమె మండిపడ్డారు. విధి నిర్వహణలో వైద్యులు ఆసుపత్రికి వచ్చిన పేషెంట్లకు మెరుగైన చికిత్స అందించి ఈ ఆసుపత్రికి మంచి పేరు తేవాలని వైద్యులను సూచించారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ కుమార్ ఆసుపత్రిలో ఉన్న సమస్యలు ఎమ్మెల్యే దృష్టి తీసుకువచ్చారు. ముఖ్యంగా ఆస్పత్రిలో గైనకాలజిస్ట్ లేక డెలివరీ కేసులు పార్వతిపురం, కురుపాం ఆసుపత్రులకు తరలించాల్సి వస్తుందని, ఎక్స్‌రే మిషన్ అవసరమని, రెగ్యులర్ జూనియర్ అసిస్టెంట్ పోస్ట్ అవసరమని ఆమెకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రభు తేజ, డాక్టర్ కృష్ణ చైతన్య, చంద్రవర్మ, డాక్టర్ రమ్య సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో వసతి గృహాల్లోని సమస్యలు పరిష్కారించాలని కోరుతూ ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవను గిరిజన సంఘాల నాయకులు కోరారు. గురువారం వారు మర్యాదపూర్వకంగా కలిసి సమస్యల్ని వివరించారు. అలాగే జీవో 342 ప్రకారం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు జీత భత్యాలు పూర్తిగా చెల్లిస్తూ ఆన్‌డ్యూటీ సౌకర్యం కల్పించాలని, డిఇఒకు తెలుపుతూ ఎస్టీ అన్ ట్రెయిన్డ్ ఉపాధ్యాయులకు ఆన్ డ్యూటీపై అవకాశం కల్పించాలని కోరారు.

డిఎడ్‌ను దూరవిద్యా విధానంలో పబ్లిక్ హాలిడేస్‌లో మాత్రమే శిక్షణ పూర్తి చేయటం జరిగిందని, తదుపరి పదోన్నతికి బిఎడ్ కోసం జీవో 342 ప్రకారం అర్హులైన ఎస్టీ అన్ ట్రెయిన్డ్ ఉపాధ్యాయులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అవకాశం కల్పించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న మెమో ప్రకారం కొన్ని ఇబ్బందులు ఉన్నందున పై స్థాయి అధికారులకు తెలియజేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని డిఇఒ సానుకూలంగా స్పందించారని చెప్పారు.

ఈ కార్యక్రమంలో ఆదివాసీ ఉపాధ్యాయుల సంఘం విజయనగరం జిల్లా అధ్యక్షులు ఎం అమర్ నాథ్, మన్యం జిల్లా అధ్యక్షులు జన్ని పైడిరాజు, ప్రధాన కార్యదర్శి తాడంగి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు వాటక చక్రపాణి, పార్వతీపురం, కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం సింహాచలం, జి.భగవాన్, కె.రవి, అరుణా శ్రీ విశ్వేశ్వరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల కుటుంబాలకు రూ.10లక్షలు చెల్లించాలి

- మరణాలకు ప్రభుత్వానిదే బాధ్యత
- ఆదివాసీ జెఎసి జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ కుమార్

ప్రజాశక్తి - పార్వతీపురం

పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎల పరిధిలో అనారోగ్యంతో మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు రూ.10లక్షల పరిహారం చెల్లించాలని ఆదివాసీ జెఎసి జిల్లా ఉపాధ్యక్షులు కె.ఉదయ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాల్లేవన్నారు. విద్యార్థులకు రక్షిత మంచినీటి సరఫరా చేసే ఆర్వో ప్లాంట్ కూడా కొంతకాలంగా పని చేయడం లేదని చెప్పారు. వర్షాకాలంలో మలేరియా, డెంగీ వైరల్ జ్వరాలు విజృంభించే అవకాశం ఉందని తెలిసినా ప్రభుత్వం దోమ తెరలు పంపిణీ చేయలేదన్నారు. జిల్లాలో ఇంతవరకు ఐదుగురు గిరిజన విద్యార్థులు అనారోగ్య కారణాలతో మృతి చెందారని తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ఐదుమంది విద్యార్థులు మృతి చెందినట్లు చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంల నియామకానికి సంబంధించిన ఫైలుపై మంత్రి సంధ్యారాణి సంతకం చేశారని, కానీ ఇంతవరకు ఆచరణలో అమలు కాలేదని చెప్పారు. ఎఎన్ఎంలను ఎప్పుడు నియమిస్తారో తెలియని అయోమయ పరిస్థితి కనిపిస్తోందని చెప్పారు. మృతి చెందిన విద్యార్థులంతా నిరుపేద గిరిజన కుటుంబాలకు చెందిన వారేనేని, వారికి రూ.10లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థుల మరణాలకు ప్రభుత్వానిదే బాధ్యతని ఉదయ్ కుమార్ చెప్పారు.

వృద్ధులకు ప్రభుత్వం భరోసా

ప్రజాశక్తి - సీతంపేట

వృద్ధులకు ఆరోగ్యంగా, ఆర్థికంగా ప్రభుత్వం భరోసా ఇచ్చి ముందుకు నడిపిస్తుందని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో అంతర్జాతీయ వృద్ధుల మాసోత్సవం ఫిజియోథెరపీ వైద్యులు బి.నిరోష ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వృద్ధులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. పెన్షన్ పరంగా ప్రభుత్వం ఇస్తుందని, అదేవిధంగా ఆరోగ్య శ్రీ వైద్య సేవలు అందుతున్నాయన్నారు. దీన్ని వృద్ధులు వినియోగించుకోవాలని కోరారు. సీతంపేట ఏరియా ఆసుపత్రిలో వృద్ధులకు కావాల్సిన ఫిజియోథెరపీ, మిగతా వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. మందులు, ల్యాబ్‌టెస్ట్‌లు ఉచితంగా సకాలంలో అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ వైద్యులు జస్వంతి తదితరులు ఉన్నారు.

రోగులతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్

మెరుగుపడని పారిశుధ్యం

- ప్రబలుతున్న వ్యాధులు
- ప్రచారానికే పరిమితమైన అధికారులు

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ప్రజాప్రతినిధులు, అధికారులు సమయం వచ్చినప్పుడల్లా ఉపన్యాసాలు ఇస్తుంటారు. ఆచరణలో మాత్రం ఎక్కడా కానవడంలేదు. మేజర్ పంచాయతీ వీరఘట్టంతో పాటు పలు గ్రామాల్లో ఎక్కడికక్కడి దర్శనమిస్తున్న చెత్తకుప్పలే ఇందుకు ఉదాహరణ. మండల కేంద్రంలోని సొండి, రెల్లి, కస్పా తదితర వీధులతో పాటు నడుకూరు, కిమ్మి, చలివేంద్రి, చిట్టపూడివలస తదితర గ్రామాల్లో అపారిశుధ్యం తాండవిస్తుంది. ఎప్పటికప్పుడు కాలువలో పూడికలు తొలగించకపోవడంతో వాటిపైన దోమలు స్వైరవిహారం చేయడంతో ప్రజలు రోగాల బారినపడుతున్నారు. గత కొంతకాలం నుంచి కాలువలో చెత్తాచెదారాలు తొలగించకపోవడంతో అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాల కారణంగా గ్రామాల్లో అపారిశుధ్యం విలయతాండం చేస్తున్నాయి.

ప్రకటనలకే పరిమితం

గ్రామాల్లో పారిశుధ్యంపై అవగాహన కల్పించేందుకు వీలుగా ఈనెల 17నుంచి మండలంలో స్వచ్ఛత హీసేవ కార్యక్రమం ద్వారా పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ ప్రచారం మూడు రోజులు ముచ్చటగా మారిందే తప్ప ఎక్కడా ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో అధికారులు మమ అనిపించుకున్నారు. ప్రచారాలపై దృష్టి పెట్టకుండా పారిశుధ్యంపై దృష్టి పెట్టి ప్రజల ఆరోగ్యం కోసం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రోగులతో నిండిన ప్రైవేటు క్లినిక్‌లు

పారిశుధ్యంతో పాటు అడపా గడపా కురుస్తున్న వర్షాలు పారిశుధ్యంతో పాటు అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాల కారణంగా వ్యాధులు ప్రబలడంతో ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకునేందుకు రోగులు ప్రైవేట్ క్లినికులకు పరుగులు తీస్తున్నారు. వేలాది రూపాయలు వెచ్చించి ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, స్థానికులు తీవ్రఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకునే పారిశుధ్యం మెరుగుపర్చేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పేరుకుపోయిన అపారిశుధ్యం

నేరాలు ఘోరాలు

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

ప్రజాశక్తి- సాలూరు రూరల్

మండలంలోని జిగిరాం సమీపంలోని మామిడి తోటలో పాచిపెంట మండలం తాడూరు పంచాయతీ చొక్కాపు వాని వలసకు చెందిన ఆటో డ్రైవర్ కోట నందీశ్వరరావు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాలు ప్రకారం.. నందీశ్వరరావు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి పెళ్లయి ఇద్దరు పిల్లలు, భార్య ఉన్నారు. అయితే వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో పాటు, మద్యానికి బానిసవడంతో భార్య భర్తల మధ్య తరుచూ గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో ఇంటికి సమయానికి రాకపోవడం, ఇంటి అవసరాలు కూడా తీర్చకపోవడంతో భార్య మందలించింది. దీంతో మనస్థాపం చెంది తోటలో చెట్టుకొమ్మకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని సాలూరు రూరల్ ఎస్ ఐ నరసింహ మూర్తి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రెండు ట్రాక్టర్లు, జెసిబి సీజ్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని యు వెంకంపేట గ్రామ సమీపంలో మరియగిరి కొండపైన అక్రమంగా కంకర తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను జెసిబిని పట్టుకొని సీజ్ చేసినట్లు తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ గురువారం తెలిపారు. వీటిని పోలీసులకు అప్పగించామని ట్రాక్టర్ల యజమానుల పై చర్యలు తీసుకోవాలని మైనింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఆయన తెలిపారు.